రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:22 (ఆదివారం సాయంత్రం) సహర్: 5:07 (సోమవారం ఉదయం)

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం 5

నీటి సంరక్షణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

లక్షెట్టిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం నీటి సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైజల మాట్లాడుతూ రాష్ట్రీయ ఆవిష్కార్ సత్తా ప్రోగ్రాంలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ర్యాలీ నిర్వహిస్తామని విద్యార్థులు సేవ్ వాటర్ నినాదాలు చేస్తు ఫ్లకార్డులతో ర్యాలీ నిర్వహించారన్నారు. పాఠశాల ఉపాధ్యాయినులు హానా మెరీనా, స్వరూప, నాగలక్ష్మి విద్యార్థినులు పాల్గొన్నారు

రేపు సంకట హర చతుర్థి

నస్పూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ శ్రీ లక్ష్మి గణపతి దేవాలయంలో ఈ నెల 17న సంకట హర చతుర్థి సందర్భంగా స్వామి వారికి మహా ఇక్షు రసాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతిరావు, ప్రధానార్చకులు వంశీ కృష్ణ శర్మలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం షోడశ ద్రవ్యాభిషేకం,గణపతి, లక్ష్మి గణపతి హోమం, సాయంత్రం చెరుకు రసంతో మహా ఇక్షు రసాభిషేకం ఉంటుంద న్నారు. చంద్ర దర్శనం అనంతరం అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

ఘనంగా కాన్షీరామ్ జయంతి

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతిని నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాస్, శంకర్, రాములు, కృష్ణచైతన్య, రాజు, అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవా కేంద్రం ప్రారంభం

కోటపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నక్కలపల్లి గ్రామంలో శనివారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు కోటపల్లి శాఖ ఆధ్వర్యంలో నూతన బ్యాంకు సేవా కేంద్రాన్ని బ్యాంకు మేనేజర్ సూసర్ల రాజేష్ ప్రారంభించారు. ఈ కేంద్రానికి బ్యాంకు మిత్రగా అదే గ్రామానికి చెందిన మానేపల్లి లక్ష్మీ అనే మహిళను నియమించారు. ఐరిస్ ప్రతినిధి గణేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లు



మినరల్ వాటర్ పేరుతో బోరు వాటర్ అమ్మకాలు

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వాటర్ ప్లాంట్లు

చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

మంచిర్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్నాయి....గొంతు తడుపుకోవడానికి ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. డబ్బులు పెట్టి నీటి ని కొనుక్కోవాల్సిన పరిస్థితి...ప్రజల అవసరాన్ని ఆసరా చేసుకొని కొందరు నీళ్ల దందాకు శ్రీకారం చుడుతున్నారు. ఇష్టారాజ్యంగా శుద్ధజల ప్లాంట్లను నెలకొల్పుతున్నారు. నిబంధనలకు తిలోదకాలిస్తూ మినరల్ వాటర్ పేరిట బోరు నీటిని అమ్ముతున్నారు. అందినకాడికి దండుకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తనిఖీలు చేపట్టాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మినరల్ వాటర్ పేరుతో...

మినరల్ వాటర్ పేరుతో కొంతమంది వ్యాపారులు మామూలు నీటిని సరఫరా చేసి అక్రమంగా డబ్బు సంపాదనకు తెరలేపారు. వేసవి కాలంలో మినరల్ వాటర్ (బోరు నీరు) ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

బోరు నీటికి కొన్ని రసాయనాలు కలిపి మినరల్ వాటర్ పేరుతో అమ్మకాలు జరుపుతున్నా పట్టించుకునే వారులేరు. జిల్లాలో ఎ లాంటి అనుమతులు తీసుకోకుండా చాలా మంది మినరల్ వాటర్ పేరుతో నీటిని విక్రయిస్తున్నారు. అయినా అధికారుల దృష్టికి రాకపోవడం అనుమా నాలకు తావిస్తోంది. జిల్లా కేంద్రంలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్లలో అనేక వాటికి అనుమతులు లేవ ని తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో మినరల్ వాటర్ ప్లాంట్లు ఉండగా, వాటిలో 90 శాతం మేర ఎక్కడా కూడా నిబంధనలు పాటించ డం లేదు.

కానరాని తనిఖీలు...

అక్రమ నీటి వ్యాపారం సంబంధిత అధికారులకు తెలిసినా తనిఖీలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేని ప్లాంట్లు నిర్వహిస్తున్నా పట్టించుకోకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. జిల్లాలో 400 పై చిలుకు మినరల్ వాటర్ ప్లాంట్లు, ఆర్వో ప్లాంట్ల పేరుతో నీటి విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఒక చిన్న గదిలో నిర్వాహకులు వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా ప్లాంట్లలో తయారు చేసిన నీటిని 20 లీటర్ల క్యాన్‌కు రూ. 20, కూల్ వాటర్ అయితే రూ. 40 చొప్పున అమ్ముతున్నారు. నిబంధనల ప్రకారం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే ఐఎస్‌వో స్టాండర్డ్స్ పాటించాలి. కానీ అలా పాటించాలంటే సుమారు రూ. 25 లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు పెట్టుబడి అవసరం ఉంటుంది. అయితే చాలా మంది అంతంత..

(తరువాయి 5లో)

నిబంధనలు ఇవీ..

ఆదునిక యంత్రాల సహాయంతో నీటిని మూడు దశల్లో మినరల్ వాటర్‌గా తయారు చేయాల్సి ఉంటుంది. ముందుగా నీటిని క్లోరినేషన్ చేస్తారు. ఆ నీటిని ప్రత్యేకమైన శాండ్ ఫిల్టర్ ద్వారా వడబోసి కార్బన్, మైక్రాన్ ఫిల్టర్ల ద్వారా శుభ్రం చేయాల్సి ఉంటుంది. తరువాత మరో కంపార్ట్‌మెంట్‌లోకి నీటిని పంపి అల్ట్రా వైలెట్, ఓజోనైజేషన్ ప్రక్రియ ద్వారా ఎటువంటి సూక్ష్మ క్రిములు లేకుండా మార్చాల్సి ఉంటుంది. చివరి దశలో ఆక్సీజన్ పంపడం ద్వారా ఆక్సీ కరణ జరిపి రంగు, రుచి, వాసన లేకుండా శుద్ధి చేయాలి. అనంతరం ప్రతీ లీటర్ నీటిలో 75 ఎంఎల్ కాల్షియం, 35 ఎంజీ మెగ్నీషియం, 0.3 ఎంజీ ఐరన్ ఉండేలా చూడాలి. క్లోరైడ్ ఒక మిల్లీగ్రామ్ మించకుం డా జాగ్రత్తలు వహించాలి. ఇలా తయారు చేసిన నీరు వారం రోజుల లోపు వినియోగించాలి. ప్రతి ఆర్ వో ప్లాంట్‌లో ఆహార కల్తీ తనిఖీ భారత ప్రమాణ సంస్థ (ఐఎస్ఐ)లోని 145, 43 సెక్షన్‌ల కింద రిజిస్టర్ కావాలి. అయితే జిల్లాలో ఈ నిబంధనలన్నీ కాగితా లకే పరిమితం కావడం గమనార్హం. పెళ్లిళ్లు, ఇతర కార్యాలలో వాటర్ క్యాన్‌ల వినియోగం పెరిగిపోవ డంతో వ్యాపారులు బోరు నీటిని వ్యాన్లలో నింపి అందులో కొన్ని రసాయనలను కలిపి విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఆదివాసీ కుటుంబాలకు అండగా ఉంటాం

మంచిర్యాల డీసీపీ భాస్కర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

తాండూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ కుటుంబాలకు పోలీసులు అండగా ఉంటారని, ఆదివాసీ యువతీ, యువకులు ఉన్నత చదువులు చదవాలని, విద్యతోనే ఏదైనా సాధించవచ్చని మంచిర్యాల డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. శనివారం మాదారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నర్సాపూర్ పంచాయతీలోని బెజ్జాల గ్రామంలో తాండూర్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో రాబిన్ వుడ్ ఆర్మీ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా 364 ఆదివాసీ గిరిజన కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమానికి డీసీపీ, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజనులు సంప్రదా య నెమలి ఈకలతో చేసిన టోపీలను ధరించి గుస్సాడీ నృత్యాలు డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రజల కోసమే పోలీసులు పనిచేస్తున్నారని, వారి భద్రత రక్షణే పోలీసుల ధ్యేయమని తెలిపారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఎన్నో సౌకర్యాలు మెరుగు పడ్డాయని, తల్లిదండ్రులు పిల్లలను చదివించుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత చదువులు చదివించాలన్నారు. గిరిజనుల శ్రేయస్సు కోసం పోలీసు శాఖ ఎల్లవేలలా సిద్ధంగా ఉంటుందన్నారు. విద్య, వైద్యం, తదితర సౌకర్యాలు కల్పించేందుకు పోలీసు శాఖ తోడ్పాటునందిస్తుందన్నారు.

అనంతరం రాబిన్‌వుడ్ ఆర్మీ సంస్థ వీకెండ్ కార్యక్రమంలో భాగంగా ఆదివాసీ గిరిజనులకు సహాయం చేయడం ఆనందంగా ఉందని ఆర్మీ వాలంటరీలు రమేష్, విక్రమ్, కార్తీక్‌లను అభినందించి సన్మానించారు. అనంతరం గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రవి కుమార్, తాండూర్ సీఐ కుమారస్వామి, మాదారం, తాండూర్, కన్నెపల్లి, బీమిని ఎస్ఐలు సౌజన్య, కిరణ్‌కుమార్, గంగారాం, విజయ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ వెంకటి, పోలీసులు మల్లేశ్, శశి, అశ్విని, బుజ్జు బాయ్, అశోక్, భరత్, మాదారం మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, గిరిజన గ్రామ పెదలు ప్రభాత్‌రావు, గంగు, పర్వతిరావు, అమృత్‌రావు, భగవంతురావు, మాణిక్‌రావు, తిరుపతి, జమున, శ్రీనివాస్, అంజి, లచ్చుబాయి, సీతాబాయి, పార్వతి బాయి, సుబాష్ పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయం : ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం మంచిర్యాల నగర పాలక సంస్థ పరిధిలోని వేంపల్లి పద్మావతి గార్డెన్స్‌లో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందన్నారు. 132 మంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన 41లక్షల 15వేల విలువ చేసే చెక్కులను అందించామన్నారు. కల్యాణలక్ష్మి, సాదిముబారక్ ద్వారా 276 మంది లబ్దిదారులకు గాను రూ. 2,76,32016ల చెక్కులను లబ్దిదారులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా డీసీసీ అధ్యక్షు రాలు కొక్కిరాల సురేఖ, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో పోస్టర్లు విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రిటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాధుని సుదర్శన్‌లు తెలిపారు. శనివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతూ పట్టణాల అభివృద్ధికి కృషి చేస్తున్న నిర్మాణ కర్తలైన భవన నిర్మాణ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. వీరి సమస్యలను పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే నెల 13న మందమర్రిలో భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామని, ఈ సభల్లో భవన నిర్మాణ కార్మికులు, అడ్డా కూలీలు, టైయిల్స్, మార్బుల్స్, పెయింటర్లు, సెంట్రింగ్, ఒడ్డెర, ఇటుక బట్టీలు, డెకరేషన్, ఐరన్ లోడ్ తదితర కార్మికులు సమస్యలపై చర్చిస్తామన్నారు. ఈ సభలకు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య, గౌరవాధ్యక్షుడు రమేష్, భవన నిర్మాణ నాయకులు ప్రవీన్‌కుమార్, లక్ష్మీనారాయణ, వెంకటస్వామిలు, అక్బర్ ఆలీ, మేకల దాసులు హాజరవుతారని తెలిపారు. కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. అనంతరం మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాడి పోశం, దుర్గం సుధాకర్, సంపత్, శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైవింగ్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెనకబడిన తరగతుల యువతీ, యువకులకు డ్రైవింగ్ కోర్సులలో ఉచిత శిక్షణ అందించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సజీవన్ శనివారం ఒక ప్రకటనలో తెలి పారు. తెలంగాణ వెనకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ద్వారా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, హైదరాబాద్ నుంచి హెచ్ఎంవీ, ఎల్ఎంవీ డ్రైవింగ్ కోర్సులలో ఉచిత శిక్షణ అందించనున్నామని పేర్కొన్నారు. 38 రోజుల శిక్షణ పూర్తి అయిన తరువాత రవాణా సంస్థ అర్హత కలిగిన అభ్యర్థులకు పర్మినెంట్ లైసెన్సు ఉచితంగా అందిస్తున్నదని తెలిపారు. ఈ నెల 31 లోగా ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి





ఏఐ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్.. జైపూర్‌లో ల్యాబ్‌లో కంప్యూటర్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్

లక్షెట్టిపేట, మార్చి15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టితో ముందుకు సాగుతోందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్ ప్రోగ్రాంలో ముఖ్య అతిదిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందించాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో 8పాఠశాలలను ఎంపిక చేశారన్నారు.

అందులో భాగంగా లక్షెట్టిపేట మండలంలో వెంకట్రావుపేట గ్రామ ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేసామన్నారు. విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్, డీఈవో యాదయ్యతో కలిసి ఏఐ టెక్నాలజీ సిస్టంను ప్రారంభించారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మనం ఉన్నత చదువులు చదవాలంటే పదవ తరగతి మార్కులు కీలకమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి నాణ్యమైన విధ్యను అందజేస్తున్నారని నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి టాపర్లుగా నిలవాలన్నారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి జవాబులు తెలసుకున్నారు. విద్యార్థుల క్రమశిక్షణపై సంతృప్తి వ్యక్తం చేసారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ కుమార్, ఎంఈవో హెలన్ డార్థి ప్రదానోపాధ్యాయుడు రాజలింగు, నాయకు లుతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు ఎండీ, ఆరీఫ్, చింత అశోక్, పింగిళి రమేష్, బొప్పు సుమన్, సత్తయ్య, చిన్నయ్య, దేవేందర్‌రెడ్డి షాహెద్‌ఆలీ, నలిమెల రాజు, రమేష్, సురేష్ నాయక్, శ్రీధర్, నవాబ్, సత్యం పాల్గొన్నారు.

ఏఐ విద్యాబోధనను సద్వినియోగం చేసుకోవాలి

జైపూర్: ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) విద్యాబోధనను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏఐ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏక్ స్టెప్ ఫౌండేషన్‌ల సహకారంతో జిల్లాలో తొలి విడతగా 7 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసిందన్నారు. అనంతరం పాఠశాలలోని వంటశాల, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. నూతన మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందించాలని, వంట సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులు వినియోగించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణ మూర్తి, మండల విద్యాధికారి శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్, వేమనపల్లి ఎంఈవో శ్రీధర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ప్రేమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన్నారం: మండలంలోని మురిమడుగు జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో శనివారం (ఏఐ) విద్యాబోధనను ఎంఈవో విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ కృత్రిమ మేధ వల్ల వెనకబడిన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం రాజేందర్, ప్రధానో పాధ్యాయుడు అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు సుభాష్, రాజన్న, తిరుపతి, రూప్‌సింగ్, సురేష్, షకీరా పాల్గొన్నారు.

నిషేధిత పత్తి విత్తనాలు పట్టివేత



పోలీసులు పట్టుకున్న పత్తి విత్తనాలు

మంచిర్యాల క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం రైల్వే స్టేషన్ సమీపంలో నిషేధిత పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అగ్రికల్చర్ ఏఈఓ తాదూరి మహేందర్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఆటోలో జీటీ పత్తి విత్తనాలు నాలుగు బ్యాగుల్లో వంద కేజీలు లభించాయన్నారు. సుమారు వాటి విలువ రూ.1.70లక్షలు ఉంటుందన్నారు. ఈ విత్తనాలను ప్రకాశం జిల్లా చంద లూరు గ్రామానికి చెందిన పెట్యాల జగదీశ్వర్‌రావు అలియాస్ జగన్ కొనుగోలు చేసినట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన వారిలో చిర్రకుంటకు చెందిన కడియాల ఉదయ్‌కుమార్, ఆకెనపల్లికి చెందిన సిద్ధం శేఖర్, చిర్రకుంటకు చెందిన మర్రిశెట్టి నరేందర్, తిర్యానికి చెందిన కాటవేయిన సాయి, బెల్లంపల్లికి చెందిన నాగెల్లి మోహన్‌గాంధీ, చిర్రకుంటకు చెందిన పొట్టల మధుసూదన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

90 గ్రాముల గంజాయి స్వాధీనం

దండేపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నిషేధిత గంజాయిని అక్రమంగా ఇంట్లో దాచి ఉంచిన 90గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు లక్షెట్టిపేట ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్ సీఐ సమ్మయ్య వెల్లడించారు. శనివారం ఉదయం దండేపల్లి మండల కేంద్రం పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఓ మహిళ ఇంట్లో గంజాయి ఉన్నట్లు నమ్మదగిన సమాచారంతో ఎక్సైజ్ సిబ్బందితో దాడులు చేశారు. ఇంట్లో సోదాలు చేయగా అక్రమంగా దాచి ఉంచిన 90 గ్రాముల గంజాయిని స్వాధీనం పర్చుకున్నారు. దీంతో నిందితురాలిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ సమ్మయ్య తెలిపారు. గ్రామాలల్లోని గంజాయిని విక్రయించినట్లతే వారిపై చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. దాడిలో లక్షెట్టిపేట ఎక్సైజ్ ఎస్సై మౌనిక, సిబ్బంది శిరీషా, వెంకటేష్ ఉన్నారు.

తండ్రిపై దాడికి సుపారి ఇచ్చిన కొడుకు

● ఆరుగురి అరెస్టు

మంచిర్యాల క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని వేంపల్లిలో తన తండ్రిపై కోపంతో రూ.50వేలు సుపారి ఇచ్చి దాడికి పాల్పడి రాబరి చేయించిన ఘటన మంచిర్యాలలో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాలను మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 14న వేంపల్లికి చెందిన నాగిరెడ్డి సదానందం, భార్య సరస్వతి ఇంటిలో ఉండగా ఇద్దరు వ్యక్తులు ఇంటిలోకి చొరబడ్డారు. వారిపై దాడి చేసి మెడలో ఉన్న తులం బంగారం ఎత్తుకెళ్లారు. సదానందం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. అనుమానితులైన సదానందం కుమారుడు నాగిరెడ్డి రమేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. రమేశ్‌కు తన తండ్రితో కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. వీటిని మనసులో పెట్టుకున్న రమేశ్ తన తండ్రిపై దాడి చేయించాలన్న ఆలోచనతో తనతో పరిచయమైన కొల్లి అవినాశ్ అలియాస్ చింటు అనే వ్యక్తికి సుపారిగా రూ.50వేలు ఇచ్చాడు. చింటూ తన స్నేహితులైన మామిడిపల్లి చందు, సంతోష్, అందె అశోక్, చింతల క్రిష్ణలతో కలిసి ఇంటిదగ్గరికి వెళ్లారు. పథకం ప్రకారం ఇద్దరు బయటకాపు కాస్తుండగా మరో ఇద్దరు లోపలికి చొరబడి బంగారు చైన్‌ను లాక్కొని నలుగురు అక్కడి నుంచి పరారయ్యారు. శనివారం రమేశ్‌ను ఇంటి వద్ద పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. మిగిలిన వారిని పట్టణంలోని కాలేజీ రోడ్డులో అదుపులోకి తీసుకొని విచారించారు. నేరం అంగీకరించడంతో వారి వద్ద నుంచి తులం బంగారు చైన్, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులను రిమాండ్‌కు పంపినట్లు సీఐ అశోక్ తెలిపారు. ఈ కేసును ఒక్క రోజులోనే దర్యాప్తు చేసి చాకచక్యంగా వ్యవహరించిన మంచిర్యాల రూరల్ సీఐని హాజీపూర్ ఎస్ఐ సురేశ్‌ను, సీసీసీ ఎస్ఐ నెల్కి సుధాకర్‌లను సిబ్బందిని సీపీ అంబర్ కిషోర్‌ఝూ, డీసీపీ ఎగ్గడి భాస్కర్‌లు అభినందించారు.

మొక్కల రక్షణకు గ్రీన్‌నెట్ షెడ్లు



● వేసవిలో ఎండిపోకుండా చర్యలు ● 31 నర్సరీల్లో ప్రత్యేక ఏర్పాట్లు
● పర్యవేక్షిస్తున్న అధికారులు

కెరమెరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హరితహారం కోసం నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సంరక్షించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో పెంచుతున్న మొక్కలు ఎండి పోకుండా అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. రక్షణా చర్యల్లో భాగంగా ఎండ నుంచి మొక్కలు రక్షణకు గ్రీన్‌నెట్ షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లో పచ్చదనం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వనమహోత్సవం కార్యక్రమాన్ని చేపడుతోంది. అందులో భాగంగా ప్రతి గ్రామం పంచాయతీలో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపడుతోంది. మండల వ్యాప్తంగా జూన్ నెల వరకు మొక్కలను పెంచాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. ప్రతీ నర్సరీలో పది వేలకు తగ్గకుండా మొక్కలను పెంచి సిద్ధం చేస్తున్నారు. ఎండ కాలం నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లో వన సేవకుడితో నీటిని పోస్తు మొక్కలను సంరక్షిస్తున్నారు. మొక్కల చుట్టు ప్రత్యేకంగా స్తంభాలు ఏర్పాటు చేసి వాటిపై చలువ పందిళ్లు వేసి గ్రీన్‌నెట్ షెడ్లు నీటితో తడుపుతూ మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటున్నారు.



కూలీలకు ఉపాధి..

ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో ఏర్పాటు చేసిన గ్రామీణ నర్సరీలలతో కూలీలు ఉపాధి పొందుతున్నారు. వన సేవకులు నర్సరీలలో మొక్కలకు నీరు పోస్తూ మొక్కలు ఎండి పోకుండా చర్యలు తీసుకుంటున్నారు. న్సరీ నిర్వహణ కోసం ఉపాధిహమీ పథకం ద్వారా కొన్ని గ్రామాల్లో రైతులను ఎంపిక చేసింది. రైతులు ముందుకు రాని చోట గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీల్లో జామ, ఉసరి, అల్లనేరడు, చింత, సీతాఫలం, దానిమ్మ, బాదం, ఖర్జురా, అడవి తంగెడు, గుల్మార్‌తో పాటు గులాబీ, మల్లె, మందారం, కరివేపాకు, మెహందిలతో పాటు ప్రజల డిమాండ్ ఉన్న మొక్కలు పెంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 31 నర్సరీలను ఏర్పాటు చేశారు. అందులో 3,75,000 మొక్కలు పెంచేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు ప్రతి నర్సరీలో 10, 12, 14 వేల మొక్కలను పెంచాలని నిర్ణయించారు. నర్సరీల్లో సిద్ధం చేసిన మొక్కలను జూన్, జూలై నెలల్లో ప్రభుత్వ స్థలాలు, రోడ్లకు ఇరువైలా నాటేందుకు చర్యలు తీసుకుంటారు.

మొక్కలు పెంచుతున్నాం..



అంజద్‌పాషా, ఎంపీడీవో

మండలంలోని 31 గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీ లలో మొక్కలు పెంచుతున్నాం. నర్సరీ పనులు వేగం గా కొనసాగుతున్నాయి. నర్సరీల లో నిత్యం పర్య వేక్షించడంతో పాటు నిర్వహకులను నియమించి సూచనలు ఇస్తున్నాం. లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు పెంచి వన మహోత్సవానికి సిద్ధం చేస్తున్నాం.

పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతకు చర్యలు

హనుమంతు, ఎంఈవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: పదో తరగగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఏం చర్యలు తీసుకుంటు న్నారు?

ఎంఈవో: పదో తరగతిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. పరీక్ష లకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహి స్తున్నారా?

ఎంఈవో: ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. అడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి రోజు స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వెనకబడిన విద్యార్థులపై ఏం చర్యలు తీసుకుంటు న్నారు?

ఎంఈవో: వెనక బడిన విద్యార్థులు ఏఏ సబ్జెక్టులలో వెనకబడి ఉన్నారో సమీక్షించాం. వివరాలు తెలుసుకుని ఆయా సబ్జెక్టుల్లో వారిని ప్రత్యేకంగా బోధిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు?

ఎంఈవో: మండలంలో 305 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వారి కోసం రెండు కేంద్రాలు ఏర్పాటు చేశాం.

- కౌటాల, ఆంధ్రజ్యోతి

నీలుగాయిని హతమార్చిన నలుగురిపై కేసు నమోదు

పెంచికలపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పెంచికలపేట రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో నీలుగాయిని వేటాడి చంపిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో అనీల్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం రాత్రి పెంచికలపేట నుంచి ఆర్‌గూడ రహదారిపై సిబ్బంది గస్తీ నిర్వహించారని చెప్పారు. ఈ క్రమంలో పెంచికలపేటకు చెందిన అప్పాజీ శ్రీనివాస్, అప్పాజీ వెంకటేష్, మేకల రమేశ్, ఒడ్డుగూడకు చెందిన బింకరి తిరుపతి అనే నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా రక్తపు మరకలతో బైక్ మీద కనిపించారన్నారు. వారి వద్ద రెండు గొడ్డలు కనిపించడంతో అనుమానం వచ్చి స్థానిక రేంజ్ కార్యాలయానికి తీసుకెళ్లి విచారణ చేపట్టామని తెలిపారు. బొక్కివాగు సమీపంలో ఆగర్‌గూడ బీట్ పరిధిలోని అటవీ ప్రాంతానికి అనుకొని ఉన్న కరెంటు తీగల సాయంతో బిగించి శుక్రవారం ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో నీలుగాయాని వేటాడి దాన్ని గొడ్డళ్ల సాయంతో ముక్కలు చేసి మాంసాన్ని పోగులు చేసుకుని వండుకుని తిన్నట్లు తెలిపారు. విచారణలో భాగంగా నిందితులను తీసుకెళ్లి సంఘటన స్థలం వద్ద పరిశీలించామని అన్నారు. కరెంటు ఉచ్చులకు సంబంధించిన ఇనుప తీగలు, వైర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. నిందితుల నుంచి బైక్, రెండు మొబైల్ ఫోన్‌లు, రెండుగొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

న్యాయం చేయాలని వినతి

లింగాపూర్ మార్చి 15 (ఆంధ్రజ్యోతి); మండల కేంద్రంలో 4,670 ఎకరాల భూముల్లో పనులు చేసుకోకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, తమకు న్యాయం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రేను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బలిరాం, మాజీ వైస్ ఎంపీపీ గణపతినాయక్, రమేశ్, బానోత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏఐ బోధన



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

రెబ్బెన, మార్చి 15 (ఆంధ్రజ్యోతి):కృత్రిమమేధ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) ద్వారా అందిస్తున్న బోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం రెబ్బెన మండలం తక్కళ్లపల్లి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా పదో తరగతి విద్యార్థులకు బోధన అందించే కంప్యూటర్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో తొలివిడతగా చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం నాలుగు పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ల్యాబ్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఏక్ స్టెప్ ఫౌండేషన్‌ల సహకారంతో ఏర్పాటు చేసినట్లు వివరించారు. త్వరలో మరికొన్ని పాఠశాలలో ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భాష, గణిత సామర్థ్యాల సాధన పెంపొందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఎంతగానో దోహద పడుతుందన్నారు. కృత్రిమ మేధస్సు విద్యారంగంలో అమలు చేయడం విప్లవాత్మకమైన ఆలోచన తెలిపారు. ఎంపికైన పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేలా బోధన చేయాలన్నారు. ఒక్కొక్క కంప్యూటర్ ఒక్కొక్క ఉపాధ్యాయుడని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదో తరగతి విద్యార్థులు కేవలం ఉత్తీర్ణతే కాకుండా మంచి మార్కులు సాధించాలని సూచించారు. తక్కళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మార్పులు తీసుకవచ్చిన ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాంమోహన్ రావు, ఎంపీడీఓ శంకరమ్మ, విద్యాశాఖ సమన్వయ కర్త ఉప్పులేటి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శంకరమ్మ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై కేసు

బెల్లంపల్లిరూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఈ నెల 14న దహనం చేసిన విషయంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో పలువురు నాయకులపై కేసు నమోదు చేసినట్లు తాళ్లగురిజాల రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మున్సిపల్ కార్యాలయం చౌరస్తా వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసినందుకు నిరసనగా బీఆర్ఎస్ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో పాటు పలువురు నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అడవిలో కార్చిచ్చు



అటవీప్రాంతలో అంటుకున్న మంటలు

పెంచికలపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పెంచికటపేట, బెజ్జూరు మధ్య గల అటవీ ప్రాంతంలో శనివారం రాత్రి 7 గంటల సమయంలో కార్చిచ్చు కనిపించింది. ప్రస్తుతం వేసవి ఎండలకు మంటలు అంటుకున్నాయా, ఎవరైనా నిప్పు పడేశారా అన్న విషయం తెలియరాలేదు. మంటలు వ్యాపిస్తే పలు రకాల అరుదైన వృక్షాలు కాలిపోయే ప్రమాదం ఉంది.

18 నుంచి క్రికెట్ పోటీలు

దహెగాం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం గెర్రె గ్రామంలో మంగళవారం నుంచి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ లెవల్ టోర్నమెంట్‌లో జట్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం



ఐకే 1ఏ గనిపై మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ నాయకులు

జైపూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ డివిజన్‌లో కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఏఐటీయూసీ విఫలమైందని హెచ్ఎంఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు తిప్పారపు సారయ్య పేర్కొన్నారు. శనివారం ఇందారం ఐకే1ఏ, ఐకే ఓసీపీలను సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనుల్లో అధికారుల పర్యవేక్షణ లేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. కార్మికుల మస్టర్ నమోదు చేసుకున్న వెంటనే గనిలోకి వెళ్లాలని లోపలికి తరుముతున్నారన్నారు. మ్యాన్ రైడింగ్‌ను ఉదయం 8.30 గంటల వరకే నిలిపివేస్తున్నారని, తర్వాత వచ్చిన కార్మికులు కాలినడకన గనిలోపలికి వెళ్లడం జరుగుతుందన్నారు. అధికారులు మాత్రం 11 గంటల తర్వాత నిదానంగా ఒకరి తర్వాత ఒకరు మ్యాన్ రైడింగ్ ద్వారా వెళ్లి గంటలోనే ప్రత్యేక బోగిలు ఏర్పాటు చేసుకుని పైకి వస్తున్నారన్నారు. కార్మికులు మాత్రం మధ్యాహ్నం 2 గంటల తర్వాత మ్యాన్ రైడింగ్ ఆన్ చేయడంతో పాటు పైకి వచ్చే సరికి చాలా సమయం అవుతుందన్నారు. ఇటీవల ప్రమాదానికి గురైన అంగల రాజయ్య అనే కార్మికునిపై ఐదు ఫీట్ల మందం గల బండ పడి మూడు చోట్లు కాలు విరిగిందన్నారు. కానీ స్లిప్ అండ్ ఫిల్ డౌన్ అని అధికారులు తప్పుడు రిపోర్టు రాశారని, యూనియన్ నాయకులు గొడవ చేసిన తర్వాత సవరణ చేస్తున్నామని చెప్పి చిన్న కోల్‌పీస్ మాత్రమే పడిందని మరో సారి తప్పుడు రిపోర్టు రాశారన్నారు. ఇంత జరుగుతున్నా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు పట్టించుకోవడం లేదని, ఈ సంఘాలు యాజమాన్యం పంచన చేరడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, కార్మికులు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలను గనులపై నిలదీయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు అనిల్‌రెడ్డి, దుర్గం వెంకటేశ్వర్లు, కొమురయ్య, దుర్గం లక్ష్మణ్, రాజేందర్, సాయి, లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్ సూపర్‌బజార్‌ను వెంటనే తెరిపించాలి



మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ నాయకులు

శ్రీరాంపూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణికి చెందిన నస్పూర్ సూపర్‌బజార్‌ను వెంటనే ప్రారంభించాలని హెచ్ఎంఎస్ కేంద్ర కమిటీ నాయకుడు తిప్పారపు సారయ్య, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు వి అనిల్ రెడ్డి డిమాండ్ చేశారు. సీసీసీలోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 1వ తేదీ నుంచి సూపర్ బజార్ తెరుచుకోవడం లేదన్నారు. అయినా యాజమాన్యం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. గతంలో కూడా సూపర్‌బజార్‌లో పూర్తిస్థాయి సరుకులు లేకపోవడంతో కార్మికులు ఇతర సూపర్ మార్కెట్లలో కొనుగోలు చేసేవారని తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో 9400 మంది కార్మికులు ఉన్నారని, శ్రీరాంపూర్ సూపర్‌బజార్‌ను గతంలోనే మూసివేశారని, ఇప్పుడు నస్పూర్ సూపర్ బజార్‌ను సైతం క్లోజ్ చేయడంతో కార్మికులకు సరుకులు అందడం లేదన్నారు. ఉన్న సూపర్‌బజార్‌లను డీమార్ట్, రిలయన్స్ మార్ట్‌ల మాదిరిగా మార్చాల్సిన యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సూపర్‌బజార్లను తెరిపించాలని కోరారు. సమావేశంలో నాయకుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించాలి

రెబ్బెన, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి తెలిపారు. శనివారం అన్నీ విభాగాల అధికారులతో కాన్ఫరెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు నాణ్యతపై అధికారులకు మార్గ నిర్దేశం చేశారు. నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించాలన్నారు. ఉపరితల గని నుంచి సీహెచ్‌పీ వరకు బొగ్గు రవాణా విషయంలో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఓటు జీఎం కె.రాజమల్లు, పీఓ ఎం.నరేందర్, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీజీఎం (ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, క్వాలిటి ఇన్‌చార్జి గుమాస రవి పాల్గొన్నారు.



కార్మికుల హక్కుల సాధనకు పోరాటం



యూనియన్‌లో చేరిన వారికి కండువా వేస్తున్న నాయకులు

మందమర్రిటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల సాధనకు పోరాడే యూనియన్ సీఐటీయూ మాత్రమేనని సీఐటీయూ మందమర్రి ఏరియా బ్రాంచ్‌కార్యదర్శి వెంకటస్వామి , అల్లి రాజేందర్‌లు పేర్కొన్నారు. శనివారం ఏరియాలోని కేకే 5 గని వద్ద నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో వారు మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు కార్మికులకు చేసిందేమి లేదన్నారు. త్వరలోనే అనేక పాత గనులు మూత పడుతున్నాయని, నూతన గనుల ఊసేలేదన్నారు. రానున్న రోజుల్లో సింగరేణి మనుగ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. అనంరతం పలువరు కార్మికులు యూనియన్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శి వెంకటేష్, నాయకులు ఆదర్శ్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

శ్రీరాంపూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తమ వేతనాలు, ఇతర హక్కుల గురించి జీఎంకు వినతిపత్రం ఇస్తే కార్మికులకు డ్యూటీ నిలిపివేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఓసీపీలో శనివారం ఆయన కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఓసీపీలో పనిచేసే హౌస్ డిస్‌మెటలింగ్ కాంట్రాక్ట్ కార్మికులు తమ సమస్యల గురించి అధికారులకు చెప్పడం తప్పా అని ఆయన ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం అన్‌స్కిల్డ్ కార్మికులకు కనీస వేతనం 526 రూపాయలతో పాటుగా బోనస్ ఇవ్వాల్సి ఉండగా, కేవలం 440 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం గురించి పలు దఫాలుగా అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామని, ఈ నెల 8వ తేదీని ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్‌కు మెమోరాండం ఇచ్చామని తెలిపారు. సమావేశంలో ఫిరోజ్‌ఖాన్, ప్రేమ్‌కుమార్, గిరీష్, తేజ, సంపత్, వినోద్, వంశీ, సాయి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో పశువులకు దాణా మిశ్రమాన్ని అందించాలి

మండల పశు వైద్యాధికారి సరిత



ఆంధ్రజ్యోతి : ఎండాకాలంలో పశువుల ఆహార నియమాల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

పశువైద్యాధికారి : ఎండాకాంలో పశువులకు ఎక్కువగా దాణా మిశ్రమాన్ని అందించాలి. దీని వల్ల న్యూట్రిషన్ మినరల్స్ (ఖనిజ లవణాలు) ఎక్కువగా అందుతాయి. డీహైడ్రేషన్ వల్ల పశువులు ఎక్కువ దాహనికి గుర వుతాయి. మురుగు నీరు నిల్వ నీటిని కాకుండా కాలువల్లో నీటిని తాగించాలి.

ఆంధ్రజ్యోతి : వేసవిలో పశువులను సంరక్షించుకోవడం ఎలా ?

పశువైద్యాధికారి : మనుషులు అయినా పశువులు అయినా వడదెబ్బ బారిన పడతాయి. కాబట్టి ఉదయం, సాయంత్రం వేళలోనే పశువులను మేత కోసం బయటకు తీసుకువెళ్లాలి. ఎండలో బయటకు తీసుకువెళ్లవద్దు. పశువులను చెట్ల నీడలో లేదా పాకల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : పశుగ్రాసం కొరతను అధిగమించడం ఎలా?

పశువైద్యాధికారి : పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు ఎస్ఎస్‌జీ రకం జొన్న విత్తనాలు మార్కెట్‌లో అందుబా టులో ఉన్నాయి. నీటి సౌకర్యం లేకపోయి నా ఆరుతడితోనే పంట ఏపుగా పెరుగు తుంది. 50 రోజుల్లోనే పశుగ్రాసం చేతికి వస్తుంది. పచ్చి గడ్డిని ముక్కలు ముక్కలు వేసి దాణా గేదెలకు పెట్టడం వల్ల మంచి పాల దిగుబడి వస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటాయి.

-కాసిపేట, ఆంధ్రజ్యోతి

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లక్షెట్టిపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సూరారం సబ్ స్టేషన్‌లో ట్రాన్స్ ఫార్మర్ల మార్పిడి చేస్తున్నట్లు అందుకుగాను సూరారం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ గణేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుల్లకోట, పోతపల్లి, అంకత్ పల్లి, సూరారం, లక్ష్మీపూర్, ఇటిక్యాల గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రేపు గూడెం ఆలయ హుండీ లెక్కింపు

దండేపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం శ్రీరామా సహిత సత్యనారాయణస్వామి దేవస్థానంలో ఈనెల 17 సోమవారం రోజున ఆలయంలో లెక్కిస్తామని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 14న పౌర్ణమి జాతర సందర్భం గా భక్తులు కానుకగా, ఇతర రసీదులు, లడ్డు, పులిహోరల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కిస్తామని తెలిపారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- మరమ్మతులకు నోచుకోని ట్రాక్టర్లు
- పేరుకుపోతున్న చెత్త నిల్వలు పంచాయతీల్లో గాడి తప్పుతున్న ఇన్‌చార్జీల పాలన
- నిధుల లేమితో కూనరిల్లుతున్న పంచాయతీలు
- పట్టించుకోని అధికారులు.. అవస్థల్లో ప్రజలు

కాసిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. సర్పంచుల పదవీ కాలం ముగిసి ఏడాది దాటినా ప్రత్యేక పాలనలోనే గ్రామ పంచాయతీలు కొనసాగుతున్నాయి. జిల్లాలో సగానికి పైగా చెత్త ట్రాక్టర్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో గ్రామాల్లో చెత్త నిల్వలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడి తీవ్ర అవస్థలు పడుతున్నారు. చెత్తను తొలగించాలని స్థానికులు సంబంధిత పంచాయతీ అధికారులకు చెబితే సొంత ఖర్చులు పెట్టుకోలేమని చేతులు ఎత్తేస్తున్నారు. పంచాయతీల్లో రాబడి ఆదాయం లేక వీధి లైట్ల నిర్వహణ, చేతి పంపుల మరమ్మతులు, పారిశుధ్య పనులు నిర్వహించలేక అధికారులు సైతం తీవ్ర అవస్థలు పడుతున్నారు.

గ్రామపంచాయతీల్లో పాలక మండళ్లు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ఏడాదిగా నిధుల విడుదల నిలిపివేసింది. నిధుల కొరత వేధిస్తుండగా పారిశుధ్య కార్మికుల జీతాలు సైతం సక్రమంగా చెల్లించకపోవడంతో కార్మికులు ఎక్కువగా గైర్హాజరవుతున్నారు. దీనికి తోడు ఈ నెల 31న ముగియనున్న ఇంటి పన్నుల వసూళ్లు జిల్లాలో మందకోడిగా సాగుతున్నాయి.

జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసినా పన్నుల వసూళ్లు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ముత్యంపల్లిలో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త

వేధిస్తున్న నిధుల కొరత

గ్రామపంచాయతీలను నిధుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా చెత్త తరలించేందుకు ట్రాక్టర్లు మొరాయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 480 ట్రాక్టర్లు ఉండగా సగానికి పైగా ట్రాక్టర్ల నిర్వహణ మరమ్మతులు లేక మూలన పడ్డాయి. ట్రాక్టర్‌ల నిర్వహణ కార్యదర్శులకు అదనపు భారంగా మారింది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందించే అదనపు నిధులకు రెండేండ్లుగా అడ్రస్సే లేదు. కేవలం మల్టీ పర్పస్ కార్మికుల జీతాలు, కరెంటు బిల్లులు అరకొరగా చెల్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీలకు పాలక మండళ్లు లేక కేంద్ర ప్రభుత్వం అందించే 14,15 ఫైనాన్స్‌నిధులు నిలిచిపోయాయి. దీంతో నిధులు లేకపోవడంతో చెత్త ఎత్తే ట్రాక్టర్లకు మరమ్మతులు చేయించలేక పోతున్నారు. డ్రైనేజీల్లో పేరుకు పోయిన చెత్త అలాగే దర్శనమిస్తుంది. ప్రజలు రోగాల బారిన పడక ముందే క్షేత్రస్థాయి సిబ్బంది స్పందించి చెత్తను తొలగించాలని ప్రజలు కోరు తున్నారు.

మందకొడిగా పన్నుల వసూళ్లు

జిల్లా వ్యాప్తంగా ఇంటి పన్నుల వసూళ్లు మందకోడిగానే సాగుతున్నాయి. ఈ నెలాఖరుతో ముగియనున్న ఆర్థిక సంవత్సరానికి గురువారం నాటికి 80 శాతం పన్నులు వసూలయ్యాయి. మిగిలిన 15 రోజుల్లో 20 శాతం పన్నులు వసూలు చేయాల్సి ఉంది. వంద శాతం పన్నులు వసూలు చేసేందుకు అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

ఇన్‌చార్జి పాలనకు ఏడాది

పంచాయతీల్లో ఇన్‌చార్జిల పాలనకు ఏడాది పూర్తి అయ్యింది. గత ఏడాది పంచాయతీల్లో అధికారులకు అదనపు బాధ్యలు అప్పగించడంతో పంచాయతీల పాలన గాడి తప్పింది. ఇన్‌చార్జిలుగా ఉన్న అధికారులు పంచాయతీల వైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీలకు వెళితే అధికారులను శానిటేషన్, తాగునీటి సమస్యలపై ప్రజలు నిలదీయడంతో గ్రామంలోకి అధికారులు రావడానికి జంకుతున్నారు. పంచాయతీలకు పాలకమండళ్లు లేకపోవడంతో ప్రజా సమస్యలు వినేందుకు ఎవరు లేరని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు రావడం లేదు. దీంతో కార్మికులు గైర్హాజరవుతున్నారు.



ధర్మారావుపేట తండాలో మరమ్మతులు లేక మూలన పడిన ట్రాక్టర్

చెత్త ఎత్తడంలో నిర్లక్ష్యంగా వహిస్తున్నారు

కాసిపేట, ముత్యంపల్లి గ్రామాల మధ్య డ్రైనేజీల్లో చెత్త చెదారం పేరుకుపోయినా తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. స్థానిక పంచాయతీ కార్యదర్శికి చెబితే పట్టించుకోవడం లేదు. డ్రైనేజీ మురుగు నీరు రోడ్లపైకి వస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాను.



- లంక లక్ష్మణ్, ముత్యంపల్లి

వేతనాలు సకాలంలో అందించాలి

పారిశుధ్య కార్మికులకు నెల నెలా సక్రమంగా అందించాలి. వచ్చే అరకొర వేతనాలు సకాలంలో అందకపోవడంతో పారిశుధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించి, ట్రెజరీ ద్వారా వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలి. 51 జీవోను రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి. వేతనాలను పెంచాలి.



- దాసరి రాజన్న, మల్టీపుల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

వంద శాతం వసూలు చేస్తాం

వారం రోజుల్లోగా వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేస్తాం. జిల్లా వ్యాప్తంగా ట్రాక్టర్లు పనిచేస్తున్నాయి. చిన్న చిన్న మరమ్మతులు ఉంటే స్థానికంగా మరమ్మతులు చేసుకుంటున్నారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి కాలనీలు, వీధుల్లో శుభ్రంగా ఉండేందు కు క్షేత్రస్థాయిలో పనులను చేయిస్తున్నాం. ఎక్కడైనా పారిశుధ్య పనులు జరగకపోతే స్థానిక మండల అధికారికి సమాచారం అందించాలి.



- వెంకటేశ్వర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి, మంచిర్యాల

ఆదివాసీ గూడాల్లో హోలీ సంబరాలు

కాసిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ గిరిజన గూడాల్లో శనివారం హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. శుక్రవారం రాత్రి కాముడు, కాంతమ్మలను దహనం చేసిన అనంతరం శనివారం ఆదివాసీ గూడల్లో హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. దేవాపూర్, సోనాపూర్, సాలెగూడెం, గట్రావుపల్లి, వెంకటాపూర్, రొట్టెపల్లి, మల్కే పల్లి, తాటిగూడెం, కొండా పూర్, గుండ్ల పాడ్, గురువా పూర్ గిరిజన గ్రామాల్లో ఆదివాసీ గిరిజనులు సంప్రదాయ గిరిజన వాయిద్యాలతో ఆట,పాటలతో హోలీని జరుపుకున్నారు. అనంతరం భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.



సాలెగూడెంలో హోలీ ఊరేగింపులో గిరిజన యువకులు

పాఠశాలకు బెంచీలు అందజేత

చెన్నూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లగూడెం, చెల్లాయిపేట గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు విశాఖ చారిటబుల్ ట్రస్టు ద్వారా 20 బెంచీలను శనివారం అందజేశారు. ట్రస్టు అధినేత, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో ఒక్కో పాఠశాలకు 10 బెంచీలను అందజేసినట్లు వివేక్ యువసేన నాయకులు తనుగుల రవికుమార్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గొల్లంగూడెం పాఠశాలలో విద్యార్థులతో ట్రస్టు సభ్యులు

ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమం 2025లో భాగంగా ఓటరు జాబితా సంబంధిత దరఖాస్తు ఫారాలు 6, 7, 8ల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, నూతన ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులు తొలగింపులపై వచ్చే దరఖాస్తులను పరిష్కరించడంపై రాజకీయ ప్రతినిధులకు అవగాహన కల్పించాలన్నారు. చెన్నూరు నియోజక వర్గంలో 271, బెల్లంపల్లిలో 419, మంచిర్యాల పరిధిలో 596 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, మూడు రోజుల్లో పరిష్కరించాలని తెలిపారు. ఒక కుటుంబానికి చెందిన అర్హత గల ఓటర్లు అందరు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల వివరాలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఆర్‌వోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, చంద్రకళ, ఎన్నికల అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

'ప్రధానోపాధ్యాయుడిని ఉద్యోగం నుంచి తొలగించండి'

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణంలోని చున్నంబట్టి సాయికుంటలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నైతం శ్రీనివాస్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని కోరుతూ శనివారం కలెక్టర్, డీఈవోలకు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ గిరిజన బాలికలను ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని తెలిపారు. ఆయనపై ఎన్నో కేసులు ఉన్నా సస్పెండ్ చేయడం కాదని, మొత్తం ఉద్యోగంలోకి నుంచి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్, శ్రీనివాస్, మిరియా, లలిత, చంద్రకాంత్ ఉన్నారు.

సేవ చేసేందుకే లయన్స్‌క్లబ్ ఏర్పాటు



నూతన క్లబ్ సభ్యులతో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున్

జైపూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలకు సేవ చేయడానికే జైపూర్‌లో లయన్స్‌క్లబ్ ఏర్పాటు చేసినట్లు రామగుండం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో నూతనంగా లయన్స్ క్లబ్ సభ్యులను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ద్వారా పేద ప్రజలకు, పాఠశాలలకు సేవ చేస్తామని సూచించారు. లయన్స్‌క్లబ్ ద్వారా రక్తదాన శిబిరాలను తలసేమియా వ్యాధి గ్రస్తులకు అండగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా జైపూర్ క్లబ్ అధ్యక్షుడిగా చల్ల సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మంతెన లక్ష్మణ్, కోశాధి కారిగా ముదాం రమేష్‌లను ఎన్నుకున్నామన్నారు. వీరితో పాటు 34 మంది సభ్యులను ఎన్నుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లయన్స్‌క్లబ్ సభ్యులు ప్రమోద్‌రెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

న్యాయస్థానంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

లక్షెట్టిపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పట్టణ న్యాయస్థానంలో శ్రీశివసాయి గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను న్యాయమూర్తి మహ్మద్ అసదుల్లా షరీఫ్ శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ వేసవికాలం కోర్టుకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల దాహార్తి తీర్చడం కోసం సేవా సమితి సభ్యులు ప్యూరిఫైడ్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. శివసాయి గణేష్ సేవా సమితి చేస్తున్న సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీరామమూర్తి, సభ్యులు నార్ల సుమతి, పెట్టెం తిరుపతి, తాటికొండ శ్రీనివాస్, నలుమాసు ధనలక్ష్మ, శ్రీనివాస్, కొజర్ల ప్రసాద్‌తో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడికొప్పుల కిరన్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, భూంరెడ్డి, ప్రదీప్, రాజేశ్వర్‌తో పాటు న్యాయవాదులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

- లక్షెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతిగృహంలో సేవా భారతి ఆధ్వర్యంలో విద్యార్థినుల సౌకర్యార్థం శనివారం మినరల్ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను సభ్యులు అందజేశారు. సభ్యులు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సేవా బావాలను పెంపొందించుకోవాలని సూచించారు. సభ్యులు భూపెల్లి మల్లేష్, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, హెచ్‌డబ్లుఓ చందన, వరుణ్, జనార్దన్, కల్పన, శ్యామల, పావని పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్ ప్రారంభించిన న్యాయాధికారి

నిబంధనలకు నీళ్లు..

(3వ పేజీ తరువాయి)

పెట్టుబడి పెట్టలేక తక్కువ ఖర్చుతో నిబంధనలకు విరుద్ధంగా మినరల్ వాటర్, ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తూ నీటి వ్యాపారం చేస్తున్నారు.

● అనారోగ్యాలకు మూలం...

అనారోగ్యాలకు ప్రధాన కారణం తాగునీరేనని వైద్యులు చెబుతుంటారు. కాచి, వడబోసి తాగమని సలహా ఇస్తుంటారు. అయితే అందుకు భిన్నంగా మినరల్ వాటర్ పేరుతో సాధారణ జలాన్ని ప్రజలకు అందిస్తున్నారు. కలుషితమైన నీటిలో బ్యాక్టీరియా చేరడం మూలంగా అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఉన్నాయి. మినరల్ వాటర్ పేరుతో జరుగుతున్న విక్రయాల్లో ఫంగస్ చేరి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పూర్తిగా శుభ్రం చేయని నీటిలో ఈ కోళి బ్యాక్టీరియా, కోళీఫార్మా ఎక్కువగా ఉండటం అనారోగ్యానికి కారణం అవుతుంది. వీటివల్ల టైఫాయిడ్, కామెర్లు, అతిసారం, కడుపు మంట, గొంతు సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి అనుమతులు లేకుండా నడుస్తున్న వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కేన్సర్‌తో పాఠశాల కరస్పాండెంట్ మృతి



రామ్మోహన్‌రావు

బెల్లంపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తాండూర్ మండలంలోని అచ్చలాపూర్ గ్రామానికి చెందిన వాణినికేతన్ ఉన్నత పాఠశాలల కరస్పాండెంట్ దుద్దిళ్ల రామ్మోహన్‌రావు (49) కేన్సర్‌తో శనివారం మృతి చెందాడు. కొన్ని నెలలు కేన్సర్ చికిత్స పొందాడు. రెండు రోజుల క్రితం ఆరోగ్య పరిస్థితి విషమించడం తో కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడు రామ్మోహన్‌రావు 20ఏళ్లుగా వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి ప్రైవేటు పాఠశాలను స్థాపించాడు. రామ్మోహన్‌రావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం ప్రకటించారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద శనివారం కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అధికారంలో పదేళ్లకాలంలో మాజీ సీఎం కేసీఆర్ అక్రమాలకు పాల్పడ్డారన్నారు. అప్పుల తెలంగాణగా మార్చి అభివృద్ధి చేయక పోవడంతో ప్రజలు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారన్నారు. అసెంబ్లీ సమావేశంలో దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి, మాట్లాడిన తీరు సరైందికాదన్నారు. జగదీశ్వర్ రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడినందుకు బీఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ సీఎం కేసీఆర్ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరిబాబు, రాజలింగు, గెల్లి జయరాం యాదవ్, సిలువేరు సత్యనారాయణ, కట్కం సతీష్, వెంకటేశ్‌లు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు



దండేపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దండేపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పట్ల కనీస గౌరవ మర్యాదలు లేకుండా అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం దండేపల్లి పోలీసుస్టేషన్‌లో పార్టీ నాయ కులు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రానికి తొలి సీఎం కేసీఆర్‌పై కనీస గౌరవం లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడం సిగ్గు చేటన్నారు. అతడిపై చర్యలు తీసుకోవాలని దండేపల్లి పోలీసుస్టేషన్‌లో ఎస్సై తైసోనొద్దీన్‌ను కలిసి నాయకులు ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పసర్తి అనిల్ కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అక్కల రవీందర్, నాయకులు రేణి శ్రీనివాస్, నక్క తిరుపతి, గోళ్ళ రాజమల్లు, శ్రీనివాస్, రాజన్న పాల్గొన్నారు.

పనిచేయని బోరు..పట్టించుకోరా సారూ..



వారం రోజులుగా పనిచేయకుండా పోయిన బోరు

భీమారం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండలంలోని ఆరేపల్లి గ్రామంలోని కొత్తగూడెం కాలనీలో వారం రోజుల నుంచి మోటారు పంపు పని చేయక నీటి కోసం కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం ఎన్నోసార్లు గ్రామ, మండల స్థాయి అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పశువులకు నీరు లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరు మోటారు పంపులు మరమ్మతులు చేయించి నీటి సమస్య తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

పెదింటి యువతి పెళ్లికి ఎమ్మెల్యే చేయూత

దండేపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం మదాపూర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన బట్టి లక్ష్మి-రామయ్య దంపతుల కూతురు రజిత పెదింటి యువతి పెళ్లి ఖర్చుల కోసం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు రూ. 10వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. వీటిని ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శని వారం రజిత పెళ్లి కూతురు ఇంటికి వెళ్లి కాంగ్రెస్ నాయకులు నగదు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చొప్పదండి రాజేష్, రాజారావు, శ్రీనివాస్, వినోద్‌కుమార్, చొప్పదండి లక్ష్మినారాయణ, వెంకటేష్, రాజన్న, రఘు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

కెరమెరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కొలాంకోటారి గ్రామంలో శనివారం ఎంపీడీవో అంజద్‌పాషా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని చెప్పారు. లబ్ధిదారు నేరుగా ఇళ్లను సంబంధించిన పనులను ప్రారంభించాలని తెలిపారు. అనంతరం సాంగ్వి గ్రామ పంచాయతీలో నర్సరీ, ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శులు సతీష్, గణేష్, తదితరులు ఉన్నారు.

భానుడి ప్రతాపం

» జిల్లాలో 40. 7 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు » ఉక్కపోతతో జనం అవస్థలు

ఆసిఫాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): భానుడి భగభగతో జనం అల్లాడుతున్నారు. ఉదయం పది దాటకముందే సూర్యుడు సెగలు కక్కుతుండడంతో జనం బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎండలు దంచి కొడుతున్నాయి. ఎండ వేడిమికి జిల్లా కేంద్రంలోని రోడ్లన్ని మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారుతున్నాయి. జిల్లాలో గత పది రోజుల నుంచి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జిల్లాలో గడిచిన 24 గంటల్లో 40.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రత దృష్ట్యా అవసరమైతేనే బయటకు రావాలని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

జిల్లాలో గడిచిన 24 గంటల్లో నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా..

తిర్యాణి	40.7
కెరమెరి	40.6
చింతలమానేపల్లి	40.4
రెబ్బెన	40.4
వాంకిడి	40.4
ఆసిఫాబాద్	40.4
సిర్పూర్(టి)	40.4
బెజ్జూరు	40.3
కౌటాల	40.3
పెంచికలపేట	40.2
దహెగాం	40.2
కాగజ్‌నగర్	40.0

రోజురోజుకూ..

జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ తారస్థాయికి చేరుకోవడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పది గంటల నుంచి ఎండ చురుకుమంటోంది. 11 గంటలు దాటితే ఇంట్లో నుంచి బయటకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. అప్పటి నుంచి మధ్యా హ్నాం మూడు గంటల వరకు రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఇంట్లో ఉన్నా తీవ్ర ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలైన కూలర్లు, ఏసీల ద్వారా ప్రజలు ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందుతున్నారు.రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతలపానియాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో శీతలపానియా విక్రయాలు ఊపందుకుంటున్నాయి. అలాగే కొబ్బరి బొండాలు విక్రయాలు సైతం జోరుగా కొనసాగుతున్నాయి.



ఆసిఫాబాద్‌లో మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన రోడ్డు

యువ వికాసం.. ఉపాధికి సోపానం

ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మార్చి 15 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు ఏప్రిల్ 6 నుంచి దరఖాస్తులు పరిశీలిస్తామని ప్రభుత్వం వెల్లడించింది.



- 'రాజీవ్ యువ వికాసం' కింద ఆర్థిక సాయం
- నిరుద్యోగులకు చేయూతనివ్వాలని యోచన
- జిల్లాలో 8,400 మందికి లబ్ధి
- ఎంపికైన వారికి జూన్ 2న మంజూరు పత్రాలు

బెజ్జూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత ఆర్థిక స్వావలంబన సాధించేలా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకుఆర్థిక సాయం అందించేందుకు 'రాజీవ్ యువ వికాసం' పథకం అమలు చేయబోతోంది. ఒక్కో లబ్ధిదారుకు గరిష్ఠంగా మూడు లక్షల వరకు ఆర్థిక సాయం అందించాని నిర్ణయించారు.

● చేకూరే ప్రయోజనాలు..

ఒక్కో లబ్ధిదారుడికి గరిష్ఠంగా మూడు లక్షల వరకు ఆర్థిక సాయం అందించడం ద్వారా చిరు వ్యాపారాలు, చిన్న పరిశ్రమలు ఏర్పడతాయి. తద్వారా స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఎక్కువ మంది యువత ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలపై ఆధారపడకుండా సొంతంగా ఆధాయ మార్గాలను సృష్టించుకోగలుగుతారు. ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములవుతారు. నిరుద్యోగ యువత స్థిరమైన ఆదాయం పొందడం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత లభిస్తుంది.

● పథకం అమలు ఇలా..

ఈ పథకానికి కొత్తగా దరఖాస్తులు ఆహ్వానిస్తారు. అర్జీదారులు తమ యూనిట్లకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లను సమర్పించాలి.సంబంధిత కార్పొరేషన్‌తో పాటు జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో మండల స్థాయిలోని అధికారుల కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేసి తుది జాబితా ప్రకటిస్తుంది. అర్హుల ఎంపికకు సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

● ఒక్కో నియోజకవర్గానికి..

రాజీవ్ యువ వికాసం ద్వారా రాష్ట్రంలో ఐదు లక్షల మందికి ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లెక్కన ఒక్కో శాసనసభ నియోజకవర్గానికి సుమారు 4,200మందికి లబ్ధి చేకూరనుంది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రెండు నియోజకవర్గాల పరిధిలో సుమారు 8,400మందికి రాజీవ్ యువ వికాసం పథకం కింద నిరుద్యోగులకు ఆర్థిక సాయం అందనుంది. ఈ పథకానికి మార్చి 15న నోటిఫికేషన్ విడుదల చేశారు. అదే తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించి ఏప్రిల్ 5లోగా దరఖాస్తులు సమర్పించాలని నిర్ణయించింది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఏప్రిల్ 6 నుంచి మొదలు పెట్టి 31 వరకు పూర్తి చేస్తారు. జూన్ 2న స్వయం ఉపాధి పథకాలకు ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

● శిక్షణ, నైపుణ్యాభివృద్ధి..

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందించడానికి చేసిన ప్రయత్నాలు ఆరంభశూరత్వంగానే మిగిలాయి. కొద్దిమందికి మాత్రమే ఆర్థిక సాయమందగా, అనేక మంది ఏళ్లుగా నిరీక్షిస్తూనే ఉన్నారు. 'రాజీవ్ యువ వికాసం కేవలం ఆర్థిక సాయం అందించడంపైనే కేంద్రీకృతం కాకుండా దీర్ఘకాలిక ఉపాధి సృష్టికి ఉపకరించేలా పాలకులు దృష్టి సారించాలి. స్వయం ఉపాధి పథకాలు విజయవంతం కావాలంటే శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉంది.. అర్హుల ఎంపిక, పథకం అమలులో రాజకీయ జోక్యాన్ని నివారించి పారదర్శకంగా వ్యవహరిస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరే అవకాశం ఉందని చెబుతున్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని యూనియన్ జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో శనివారం డీడబ్ల్యూవో భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సంద్భంగా పలువురు మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. టీచర్ల, ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈ నెల 17, 18 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సువర్ణ, వనిత, వినోద, అంజలి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

సిర్పూర్(టి), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వెంపల్లి, రావన్‌పల్లి గ్రామాల్లో నర్సరీలను శనివారం ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి అయినందున కార్య దర్శులు, ఈజీఎస్ సిబ్బంది మొక్కలు ఎండిపోకుండా ప్రతీ రోజు నీరు పట్టాలని ఎంపీడీవో సూచించారు.

ఉపాధి డబ్బులు చెల్లించాలి

జైనూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులకు సంబంధించిన నాలుగు వారాల కూలి డబ్బులు చెల్లించాలని పలువురు కూలీలు కోరారు. మండలంలోని పవర్‌గూడ, జామ్ని, ఉసేగాం, పోచం లొద్ది, రాసిమెట్ట, గూడామామడా తదితర గ్రామాల కూలీలు శనివారం ఎంపీడీవో కార్యాలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు విలేకరులతో మాట్లాడారు. పూర్తి చేసిన పనుల కొలతలు తీసుకుని రోజులు గడుస్తున్నప్పటికి ప్రభుత్వం డబ్బులు విడుదల చేయడం లేదని చెప్పారు. తమకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జ్యోతిబాపూలే బాలుర, బాలికల గురుకుల పాఠశాలలో ఆరు నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కన్వీనర్ శ్వేత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా 31 వరకు దరఖాస్తు చేసు కోవాలని సూచించారు. ఏప్రిల్ 15 నుంచి హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

దహెగాం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను శనివారం పోలీసులు బాధితుడికి అందజేశారు. ఒడ్డుగూడకు చెందిన మల్లేష్ సెల్‌ఫోన్ గ్రామ సమీపంలో పడిపోయింది. మల్లేష్ సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై రాజు గుర్తించి అందజేశారు.

సమ్మెకు మద్దతు

ఆసిఫాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): యూనైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ ఈ నెల 24, 25 తేదీల్లో చేప డుతున్న సమ్మెకు ఏఐటీయూసీ మద్దతు తెలుపుతుందని జిల్లా నాయ కుడు ఉపేం దర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు.

వ్యాధి నిరోధక టీకా తీసుకోవాలి

వాంకిడి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, పిల్లలు తప్పనిసరిగా సకాలంలో వ్యాధినిరోధక టీకా తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యాధికారి వినయ్ కోరారు. శనివారం మండలంలోని వెల్గి గ్రామ పంచాయతీ పరిధిలో సోయంగుడ గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో గర్భిణులు, పిల్లలు ప్రతి నెలా తీసుకుంటున్న టీకాల వివరాలను పరిశీలించారు. ప్రతి నెలా తప్పనిసరిగా నిర్లక్ష్యం చేయకుండా టీకా తీసుకోవాలన్నారు. గర్భిణులు ప్రతి నెలా వైద్యశాలకు వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఉదయం పది గంటల తరువాత బయటికి వెళ్లవద్దన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఓఆర్ఎస్ పాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ రవిదాస్, ఏఎన్ఎం పుష్ప, ఆశావర్కర్ సారిక మహిళలు పాల్గొన్నారు.



వివరాలను పరిశీలిస్తున్న వైద్యాధికారి వినయ్

దళారీ వ్యవస్థను అరికట్టాలి

ఆసిఫాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లాలోని ఆర్టీవో కార్యాలయంలో దళారీ వ్యవస్థను అరికట్టాలని టీపీజీఎస్, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవో మధుకర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడారు. వాహన రిజిస్ట్రేషన్, లైసెన్సుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఆర్టీవో కార్యాలయం వెళ్తే బ్రోకర్ ద్వారా రావాలని చెబుతున్నారని అన్నారు. వేరే అవకాశం లేక వారినే ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మాలశ్రీ, కార్తీక్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ బౌద్ధ సమ్మేళనానికి ఎంపిక

వాంకిడి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): భూటాన్ దేశంలో ఈనెల 16 నుంచి 22 వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ బౌద్ధ సమ్మేళనానికి వాంకిడికి చెందిన బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు మహోల్కార్ అశోక్ ఎంపికయ్యారని భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పరందాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత దేశం నుంచి హాజరవుతున్న మొత్తం 35 మంది డెలిగెట్స్ లతో పాటు ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం నుంచి అశోక్ మహోల్కార్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. వారం రోజుల పాటు బౌద్ధ మత సిద్ధాంతాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు.

నిలిచిన మిషన్ భగీరథ నీరు

» గెర్రె గ్రామస్థుల అవస్థలు
» పట్టించుకోని అధికారులు
» వ్యవసాయ బావులే దిక్కయ్యాయని ఆవేదన



బిందెలో తాగునీరు తీసుకొస్తున్న మహిళ

దహెగాం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచి పోవడంతో మండలంలోని గెర్రె గ్రామంలో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల క్రితం కాగజ్‌నగర్ సమీపంలోని పెద్దవాగు నుంచి తాగునీరు ఇచ్చే పైప్‌లైన్ ఉన్న చోట అభివృద్ధి పనులు కొనసాగుతుండడంతో సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు తాగునీటికి వేసవి కాలం కావడంతో నీటి అవసరాల కోసం తిప్పలు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో 213 కుటుంబాలు నివసిస్తున్నాయి. దీంతో తాగునీరు ఇతర అవసరాల కోసం నీటిని చేతి పంపులు, వ్యవసాయ పంపుసెట్ల నుంచి ఎడ్లబండ్లలో డ్రమ్ముల ద్వారా తీసుకొచ్చుకుంటున్నామని చెబుతున్నారు. ఎండ్లబండ్లు లేని వారు బిందెల్లో నీరు నింపుకుని తలపై పెట్టుకుని నీటిని తీసుకుని వస్తున్నారని మహిళలు ఆవేదన చెందుతున్నారు. గ్రామంలో మొత్తం పది చేతి పంపులు ఉన్నాయి. ఇందులో నాలుగు మరమ్మతులకు గురైనా అధికారులు బాగు చేయించడం లేదని చెబుతున్నారు. ఆరింటిలో నాలుగు చేతి పంపులకు మోటర్లు పెట్టి కొన్ని వాడలకు నీరు సరఫరా చేస్తున్నారు. మిగితా వాడల్లోన్ని వారు రెండు చేతి పంపుల నుంచి నీటికి తీసుకొచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నా పని చేయడం లేదు. గ్రామ పంచాయతీ అధికారులకు విన్నవిం చినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ మరమ్మ తులకు గురవడంతో గ్రామంలో శుభకార్యాలు జరుపుకునే వారికి సైతం నీరు అందించని పరిస్థితి నెలకొంది. అధికారులు తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఎడ్లబండిపై నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్థులు

విద్యార్థులు సాంకేతిక విద్యపై దృష్టి పెట్టాలి

- ప్రైమరీ స్థాయిలోనే నేర్చుకోవాలి
- అదనపు కలెక్టర్ దీపక్ తివారి
- సమస్యలు ప్రస్తావించిన ప్రజలు



కంప్యూటర్ శిక్షణను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కెరమెరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక విద్యను ప్రాథమిక స్థాయిలోనే నేర్చుకోవా లని అదనపు కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. మండలం లోని గోయగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎంపీపీఎస్ పాఠశాలకు చెందిన విద్యా ర్థులకు సాంకేతిక విద్య (కప్యూటర్) శిక్షణ తరగ తులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి రోజుల్లో విద్యార్థులు ప్రైమరీ స్థాయిలోనే సాంకేతిక విద్యను నేర్చుకోవాలన్నారు. సాంకేతిక విద్య ద్వారా ఉన్నత చదువులలో కంప్యూటర్ పరిజ్ఞానం కీలకమని అన్నారు. అనంతరం గ్రామస్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో నిర్మించిన ఐహెచ్ఎల్, ఇంకుడుగుంతలు, గతంలో చేసి పనికి డబ్బులు రాలేదని ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. అలాగే రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని కోరారు. ఆయన వెంట ఎంఈవో ప్రకాష్, ఉపాధ్యాయులు రమేశ్, విష్ణుగౌడ్, హెచ్ఎం సత్యనారాయణ, రవితేజ పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): సాంకేతికతో మెరుగైన విద్య అందుతుందని ఎంఈవో సునీత అన్నారు. పీఎంశ్రీ పథకం కింద మండలంలోని సలుగుపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం కంప్యూటర్లను ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెనక బడ్డ విద్యార్థులను గుర్తించి సాంకేతిక ఉన్నత విద్య అందించేందుకు ప్రభుత్వం పీఎంశ్రీ పథకం కింద ఎంపిక చేసిన పాఠశాలకు కంప్యూటర్లు అందజేసిం దన్నారు. ఇందులో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక విద్య అందించి రాబోయే రోజుల్లో ఉన్నత ప్రమాణాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అరవింద్, మమత, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.